# 66

## 'గులాబి'



ఉగాదికి రెండు రోజులు ముందుగా వూరికి రమ్మని లెటరు వచ్చింది శీనుకి.

శలవు పెట్టి వెళ్ళడానికా? తను ఆఫీసులో పర్మినెంట్ వుద్యోగస్తుడు కాదు.

అలాగని ఎగగొట్టి వెళ్ళడానికి కూడా వీలులేని డైలీ వేజెస్ వుద్యోగం.

అడిగి పర్మిషన్ తీసుకోను ఆఫీసరు కూడా లేకపోవడంతో ప్రమోషన్ లిష్టులో వున్న ఓ సీనియర్, యిన్ ఛార్జీ ఆఫీసరుగా ఆ సీటు చూసుకుంటువ్నాడు.

పైగా అతనికి తనలాంటి చిన్న వుద్యోగస్తులంటే చిన్న చూపు చూసే స్వభావం.

ఎప్పుడు ఏ మూడ్‌లో వుంటాడో ఎవ్వరికి అంతుబట్టదు. అయినా ప్రయత్నిద్దాం అనుకొని, గుండెలు అరచేతిలో పట్టుకొని రూములోకి తొంగి చూశాడు.

యిన్‌ఛార్జి ఆఫీసరు ఒక్కడే రూములో కూర్చొని వున్నాడు.

"మే ఐ కమిన్ సార్" వణికే గొంతుతో అడిగాడు శీను.

"అవసరమైతే నేనే పిలుస్తాన్ను గదా" మండిపడ్డాడు ఆఫీసరు పేపరు అందుకుంటూ.

సరిగ్గా అప్పుడే ఆఫీసరు టేబుల్ మీదున్న ఎర్ర గులాబీ శీను కంటపడింది.

"సార్ ఈ గులాబీ దేవుడి పటం దగ్గర పెట్టమంటారా?" అని అడిగాడు — ఈ మధ్య దైవభక్తి పెరిగిందేమోనన్న అనుమానంతో.

"ఆ పువ్వు తెచ్చింది నేను. దాన్ని ఎక్కడ పెట్టాలో నాకు తెలుసు. నోరు మూసుకొని వచ్చిన పనేంటో చెప్పు" కోపంతో వురిమి చూస్తున్న ఆఫీసర్ ప్రస్తుతం ఏ మూడ్‌లో వున్నదీ అర్థమయినా ధైర్యం చేసి అడిగాడు శీను.

"సార్ పండక్కి మా వురెళ్ళాలి. రేపు, ఎల్లుండి రెండు రోజులు శలవు యిప్పించగలిగితే..."

"యిక్కడ డ్యూటీ నీ తాత చేస్తాడా?"

"మా తాతపోయి చాలా కాలం అయింది సార్" అన్నాడు అభిమానం చంపుకోలేక.

"గెటవుట్" పళ్ళు పట పట కొరుకుతూ కుర్చీలోంచి పైకి లేచాడు మెడపట్టి గెంటాలన్నంత కోపంగా.

ఆఫీసరు అరుపుకు చేసేదిలేక బయటికి వస్తున్న శీనును మిగిలిన స్టాఫంతా ఎగాదిగా చూస్తుంటే, కళ్ళల్లో కన్నీళ్లు సుడుల్లా తిరిగాయి.

అందరూ లంచ్ కెళ్ళినా శీను మాత్రం దిగాలుగా అక్కడే ఓ టేబుల్ చాటున పడుకున్నాడు. ఆ తర్వాత బయటికెళ్ళిన శీను సాయంత్రం నాలుగు గంటలకు మళ్ళీ ఆఫీసుకు వచ్చాడు. అప్పటికే తన కోసం నాలుగు సార్లు కబురు చేశాడని తెలిసి ఆఫీసరు రూములోకి వెళ్ళాడు.

"అందరూ లంచ్ కెళ్ళితే ఆ టైములో నువ్వు ఆఫీసులో ఎందుకున్నావయ్యా."

"మా అమ్మానాన్న గుర్తొచ్చి ఏడుపు వస్తుంటే టేబుల్ చాటున పడుకున్నాను."

"నువ్విలా బాధపడితే నేను భరించలేను. రెండు రోజులేం ఖర్మ వారం రోజులు శలవు గ్రాంట్ చేస్తాను. సరేనా."

"మరి నా పని ఎవరు చేస్తారు సార్?"

"మీ తాత కాదు. మా తాత వచ్చి చేస్తాడు సరేనా" జుట్టు పీక్కుంటూ అన్నాడు.

గర్వంగా బయటికి వస్తున్న శీనును స్టాఫంతా ఎగాదిగా చూస్తున్నారు. యింతలోనే అతను చేసిన ఘన కార్యం ఏమిటో అర్థం కాక.

కాని అందులోని ఆంతర్యం గ్రహించిన శీను మాత్రం ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ లంచ్ టైంలో జరిగిన సంఘటన గుర్తు తెచ్చుకున్నాడు మరోసారి.

ఆఫీసు స్టాఫంతా లంచ్ టైంలో బయటికెళ్ళారనుకొని ఆఫీసరు దొంగ చూపులు చూసుకుంటూ లేడీ టైపిస్టు దగ్గరకు రావడం, ఉదయం తెచ్చిన గులాబి పువ్వు టైపిస్టు జడలో పెట్టడం, ఆ తర్వాత అమాంతం ఆమెను గట్టిగా కౌగిలించుకోవడం, ముద్దులతో ముంచెత్తడం, అది తన కళ్ళల్లో పడి ఖంగుతినడం.

షాక్ ట్రీట్‌మెంట్‌గా పిలిచి మరీ శలవు యివ్వడం.

— యమ్.యస్. భాను.